జనాభా నిర్వహణ విధానం పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - కడప

'జనాభా నిర్వహణ విధానం ప్రతి కుటుంబం ముఖ్యం - మీ అభిప్రాయం మార్గదర్శకం' అనే పోస్టర్ను కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వేగంగా మారుతున్న జనాభా మార్పులను దృష్టిలో ఉంచుకుని, ప్రత్యేకమైన జనాభా నిర్వహణ విధానాన్ని రూపొందించాలనే ఆలోచన, సామాజిక నిర్మాణంలో చోటుచేసుకుంటున్న మార్పులు తగ్గుతున్నా కుటుంబ పరిమాణం, వృద్ధుల సంఖ్య పెరుగుదల, పిల్లల జనాభా తగ్గుదల, పని వయస్సు గల ప్రజల జీవనశైలిలో మార్పులు వల్ల ప్రజల అవసరాలు, ఆశయాలు మారుతున్నాయని సూచిస్తున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో,ప్రజల అవసరాలకు ప్రతిస్పందించే విధంగా వ్యూహాలు, విధానాలను అభివృద్ధి చేయడం అత్యంత అవసరం చెప్పారు.

ఎస్‌హెచ్‌జిలకు రుణాలివ్వాలి : కలెక్టర్

అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప

స్వయం సహాయక సంఘాలకు రుణ సహకారం అందించి సహకరించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో డిసిసి, డిఎల్ఆర్‌సి బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలు రకాల రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లు సమర్థవంతంగా పనిచేస్తేనే ఆర్థిక వ్యవస్థ మరింత దృఢంగా ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా డిఆర్‌డిఎ, మెప్మా పరిధిలోని అన్ని స్వయం సహాయ సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి జిల్లా ఆర్థికాభివృద్ధిలో మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు. జిల్లాలో పేదరిక నిర్మూలన, మహిళా అభివృద్ధి, సాధికారిత పొదుపు సంఘాల బలోపేతంతనే సాధ్యమవుతుందని చెప్పారు. అర్హులైన యువ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూరేలా రుణ సదుపాయాలు కల్పించాలని చెప్పారు. బడుగు, బలహీన వర్గాల వారని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్టాండప్ ఇండియా, ముద్ర, గ్రామీణ ఖాదీ, పంట, విద్యా రుణాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. అనంతరం 2025-26 జిల్లా క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని బ్యాంకు అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో నాబార్డ్ ఎజిఎం విజయ విహారి, రిజర్వ్ బ్యాంక్ ఎల్‌డిఒ రాజేష్ కుమార్, కెనరా బ్యాంకు ఎజిఎం అరుణ జ్యోతి, ఎస్‌బిఐ ఎజిఎం కృష్ణ కిషోర్, యూబిఐ ఎజిఎం లక్ష్మీ తులసి, ఎపిజిబి ఎజిఎం శ్రీనివాస ప్రసాద్, కెడిసిసి సిఇఒ రాజమ్మ, డిఆర్‌డిఎ ఇన్‌ఛార్జి పీడీ ఎస్‌సి కార్పొరేషన్ ఇడి రాజ్యలక్ష్మి, మెప్మా పీడ కిరణ్ కుమార్, మైనారిటీ కార్పొరేషన్ ఇడి వి.బ్రహ్మయ్య, వ్యవసాయ శాఖ జెడి నాగేశ్వరరావు, జిల్లా ఉద్యాన అధికారిసుభాషిణి, పరిశ్రమల శాఖ జిఎం చాంద్ బాషా, డిఐఎ జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.వి. రమణ, వివిధ బ్యాంకుల జిల్లా మేనేజర్లు, ఆర్ఎంలు, బ్యాంకర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే మన లక్ష్యం : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

డ్రగ్స్ రహిత సమాజమే మన లక్ష్యమని, సమష్టి కృషితో డ్రగ్స్‌ను పారదోలుదామని ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 'ఈగల్'(ఎలైట్ యాంటి నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్మెంట్) ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించే పోస్టర్లను ఎస్‌పి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ ప్రత్యేక వ్యవస్థపై ప్రజలకు, యువతకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి, ఇతర డ్రగ్స్‌ను కట్టడి చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఈగల్ పేరుతో యాంటి డ్రగ్స్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రతి జిల్లాలో టాస్క్ ఫోర్స్ విభాగం ఉంటుందన్నారు. గంజాయి విస్తరించడంతో కీలక పాత్ర పోషించే పెడ్లర్లు, ట్రాన్స్ పోర్టర్లు, వినియోగించే వారిపై ప్రత్యేక దృష్టిపెట్టి నియంత్రించడమే లక్ష్యంగా ఉంటుందన్నారు. ఎక్కడైనా గంజాయి అక్రమ రవాణా, సాగు, విక్రయాలు, వినియోగం, తదితరాల గురించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1972 కు తెలియచేయాలని ప్రజలకు సూచించారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. యువత తమ వంతు సామాజిక బాధ్యతగా గంజాయి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌పి అశోక్‌కుమార్

కార్యక్రమంలో ఈగల్ టాస్క్ ఫోర్స్ నోడల్ ఇన్‌ఛార్జి ఆఫీసర్, ఫ్యాక్షన్ జోన్ ఇన్స్పెక్టర్ ఎస్.ఎం.డి. రియాజ్ అహమ్మద్, సైబర్ సెల్ సిఐ నాగరాజు, డిసిఆర్‌బి ఎస్ఐ బి.వి కృష్ణయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న లెక్కల కొండారెడ్డి

8వ తరగతి విద్యార్థినులకు ఉచిత విద్య

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ప్రతిభావంతులైన పేద విద్యార్థినులు ప్రభుత్వ పాఠశాలలో ఏడవ తరగతి ముగించుకుని ఎనిమిదవ తరగతిలో ప్రవేశించే వారికి ఉచిత విద్యను అందిస్తున్నట్టు కడప రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి తెలిపారు. మంగళవారం రెడ్డి సేవా సమితి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్డి సేవా సమితి కార్యవర్గం ఆలోచనల మేరకు ప్రతిభావంతులైన విద్యార్థినులకు రెడ్డి సేవా సమితి హాస్టల్‌లో వసతి కల్పించి, పాఠశాలలో చేర్పించి వారిపై చదువులకు సహకారం అందించాలన్న సద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అర్హత కలిగిన రెడ్డి సామాజిక పేద విద్యార్థినులు ఎనిమిదవ తరగతిలో ప్రవేశం కోసం ఈనెల 15 లోపు కడప నగరం రాజీవ్ మార్గ్ రెడ్డి సేవా సమితి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. వాటిని పరిశీలించి ఏడవ తరగతి సిలబస్ ప్రకారం పరీక్షలు నిర్వహించి, అందులో వారి ప్రతిభతో పాటు నడవడికను కూడా పరిశీలించి ఎంపిక చేస్తామని చెప్పారు. వారి చదువులు పూర్తయ్యే వరకు రెడ్డి సేవా సమితి బాధ్యతలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఇలా ప్రతి సంవత్సరం నలుగురు పేద విద్యార్థినులను ఎంపిక చేసి వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. వివరాలకు 9440523484, 9440651284, 9989465956 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. సమావేశంలో రెడ్డి సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ కుప్పిరెడ్డి నాగిరెడ్డి, వైయస్సార్ కడప జిల్లా రెడ్డి జనసంఘ అధ్యక్షులు మద్దిక సుబ్బిరెడ్డి, రెడ్డి సేవా సమితి కార్యవర్గ సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

అంతర్జాతీయ రేటింగ్ సాధించిన నదీమ్ సాహెబ్, రవి వంతకుమార్

ఇద్దరు సీనియర్ చెస్ క్రీడాకారులకు అంతర్జాతీయ ఫిడే రేటింగ్

ప్రజాశక్తి - కడప

కడప జిల్లాకు చెందిన ఇద్దరు సీనియర్ చెస్ క్రీడాకారులు పి. రవి వసంత కుమార్, నదీమ్ సాహెబ్ ముజమ్మిల్ అంతర్జాతీయ ఫిడే చెస్ రేటింగ్‌లను సాధించారు. మైదుకూరుకు చెందిన పి. రవి వసంత కుమార్ తమిళనాడు రాష్ట్రంలోని తిరుపత్తూరు, ఢిల్లీలో నిర్వహించిన రెండు ఫిడే క్లాసికల్ రేటింగ్ టోర్నమెంట్లలో పాల్గొని తన అద్భుతమైన ప్రదర్శనతో 1452 క్లాసికల్ ఇంటర్నేషనల్ చెస్ రేటింగ్‌ను పొందారు. ప్రస్తుతం ఆయన కడప జిల్లా, ఎస్.ఎ. కాశినాయన మండలం, ఇటుకలపాడు జడ్‌పిస్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ప్రొద్దుటూరుకు చెందిన నదీమ్ సాహెబ్ గారి ముజమ్మిల్ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఫిడే రాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొని 1491 రాపిడ్ ఇంటర్నేషనల్ చెస్ రేటింగ్‌ను పొందారు. ఈ ఇద్దరు క్రీడాకారుల ఫిడే రేటింగులను ఫిడే అంతర్జాతీయ చెస్ సమాఖ్య తమ అధికారిక వెబ్‌సైట్‌లో ఈ నెల 1న ప్రకటించింది. ఈ సందర్భంగా వైఎస్ఆర్ కడప జిల్లా చెస్ సంఘం కార్యదర్శి అనీష దర్బారి మాట్లాడుతూ కడప జిల్లాకు చెందిన ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు తమ ప్రతిభతో అంతర్జాతీయ రేటింగులు సాధించడం జిల్లా, రాష్ట్రానికి గర్వకారణమని చెప్పారు. ఇది యువతలో చెస్ ఆటపై మరింత ఆసక్తిని పెంచుతుంది అని అన్నారు.

శక్తి యాప్ సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- కడప అర్బన్ : శక్తి యాప్ మహిళలు, బాలికల రక్షణకు ఆపద సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని శక్తి టీమ్ మహిళా ఎస్ఐ శాంతమ్మ పేర్కొన్నారు. శక్తి యాప్ ఆవశ్యకత, ప్రాధాన్యత గురించి మంగళవారం నగరంలోని బిల్టప్ వద్ద ఉన్న శ్రీ చైతన్య స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది కి 'శక్తి' టీమ్ మహిళా ఎస్ఐ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రత రక్షణ కోసం అందుబాటులోకి తీసుకువచ్చిన 'శక్తి' యాప్ ఉపయోగం, సేవలు, నిక్షిప్తం, రిజిస్ట్రేషన్ గురించి జిల్లాలో ప్రతి మహిళా, బాలికలకు, విద్యార్థులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా శక్తి యాప్ టీమ్ సభ్యులు మాట్లాడుతూ ఆపద సమయంలో మహిళలు, బాలికలకు ఈ శక్తి యాప్ ఎంతగానో ఉపయోగ పడుతుందని, ప్రతి మహిళా, బాలికలు సెల్‌ఫోన్‌లో ప్లే స్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని వ్యక్తిగత వివరాలు, ఫోన్ నంబర్లతో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి సూచించారు. ఎస్ఓఎస్ బటన్, డయల్ 112 నంబర్ ద్వారా ఫిర్యాదు చేయగా పది నిమిషాల్లో మీ చెంతకు సంబంధిత పోలీస్ అధికారులు చేరుకుని మీ సమస్యను, ఆపదను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతామని తెలిపారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాల పై డయల్ 100,112, చైల్డ్ లైన్ 1098, గృహ హింస 181, మహిళ వేధింపులు 1091,సైబర్ టోల్ ఫ్రీ 1930, సైబర్ మిత్ర, సంబంధిత పోలీసు వారికి తక్షణమే సంప్రదించి పోలీసు వారు అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ ఎం. శ్రీదేవి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా సమగ్ర సమాచారంతో గ్రామదర్శిని : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

జిల్లా సమగ్ర సమాచారాన్ని మరింత సులభతరంగా తెలుసుకునేందుకు 'గ్రామదర్శిని' అనే ప్రత్యేక యాప్‌ను రూపొందించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లాకు సంబంధించి సమగ్రమైన సమాచారాన్ని ప్రజలు సులభంగా తెలుసుకునే అంశంపై అమరావతి నుండి వచ్చిన యాప్ డెవలపర్స్, సంబంధిత శాఖల అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్‌తోపాటు జూమ్ ద్వారా జెసి అదితిసింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిలా సమాచారాన్ని, జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను విశ్వ వ్యాప్తం చేసే దిశగా ఒకే చోట అన్ని రకాల సమాచారాన్ని ప్రజలు సమగ్రంగా, సులువుగా తెలుసుకునేందుకు గ్రామదర్శిని అనే యాప్ ను రూపొందించారని చెప్పారు. గ్రామ స్థాయి నుండి మండల, డివిజన్, జిల్లా స్థాయి వరకు ఈ యాప్ ద్వారా అన్ని శాఖలకు సంబంధించిన సమాచారాన్ని సులువుగా తెలుసుకోవచ్చన్నారు. గ్రామ దర్శిని (గ్రామ మానిటరింగ్ సిస్టమ్) యాప్ ద్వారా గ్రామాల్లో డోర్ టూ డోర్ చెత్త కలెక్షన్, ఎస్‌డబ్ల్యూపిసి, ల్యాండ్ సర్వే, విలేజ్ మ్యాపు, ఆడంగల్, దీపం గ్యాస్ సరఫరా, గ్రామీణ నీటి సరఫరా, పౌరసరఫరాల వివరాలు, వివిధ పౌర సేవలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవచ్చన్నారు. గ్రామదర్శిని తోపాటు పోస్టల్ మానిటరింగ్ సిస్టం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, వెండర్ కనెక్ట్ వంటి యాప్ లను ఎన్ఐసి. సెంటర్ సహకారంతో జిల్లా వెబ్ సైట్‌లో ప్లే స్టోర్‌లో కుడా డౌట్ లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంకు సంబంధించి రూపొందించిన యాప్ నిర్వహణ, పర్యవేక్షణ సంబంధించిన అంశంపై పిపిటి ద్వారా డెవలపర్స్ కలెక్టర్‌కు వివరించగా యాప్ డిజైన్, ఫీచర్స్, పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ముందుగా జిల్లా కేంద్రం కడపలో పలు పాఠశాలలు, హాస్టళ్లలో ఇప్పటికే సిద్ధం చేసిన సెంట్రలైజ్డ్ ఆటోమేషన్ ఆఫ్ కిచెన్స్ (మోడల్ కిచెన్) ద్వారా రానున్న విద్య సంవత్సరం నుండి యాప్ ద్వారా నిర్వహణ, పర్యవేక్షణ చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఒ హజరతయ్య, డిఇఒ శంశుద్దిన్, ఆగ్రోస్ డిఎం, ఎడిపి జిల్లా పర్యవేక్షకులు జోయల్ విజయ్ కుమార్, ఎస్ఎస్ఎ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

మాట్లాడుతున్న చావలముడి శంకర్

ప్రజాదృష్టిని మళ్లించడానికే డ్రామాలు

ప్రజాశక్తి కడప అర్బన్

జగన్ ముఠా డ్రామాలాడుతుందని 26వ డివిజన్ టిడిపి ఇన్‌ఛార్జి చావలముడి శంకర్ విమర్శించారు. మంగళవారం డివిజన్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంభకోణాల నుంచి ప్రజాదృష్టి మళ్లించడానికి ధర్నాల డ్రామా ఆడుతున్నారని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వంలో తొలి ఏడాదిలోనే 10 శాతం హామీలు కూడా అమలు చేయలేదని తెలిపారు. 5 సంవత్సరాలలో 85శాతం హామీలు ఎగనామం పెట్టింది జగన్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను అడ్డు పెట్టుకుని లక్షల కోట్లు దోచుకుని అదే పార్టీకి వెన్నుపోటు పొడిచిన జగన్, శివకుమార్ స్థాపించిన వైసిపిని కబ్జా చేసి వెన్నుపోటు పొడిచాడని చెప్పారు. ఆస్తి కోసం తల్లిని, చెల్లిని గెంటివేసి కుటుంబ వ్యవస్థకే వెన్నుపోటు పొడిచాడని పేర్కొన్నారు. మద్యపాన నిషేధం పై మాట తప్పి మడమతిప్పి విషపూరిత మద్యం పోసి పేదల ఆరోగ్యానికి వెన్నుపోటు పొడిచాడని తెలిపారు. అన్నా కాంటీలను రద్దుచేసి పేదలకు, కార్మికులకు వెన్నుపోటు పొడిచాడని చెప్పారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ సబ్ ప్లాన్ నిధులకు లక్ష కోట్లు దారి మళ్లించి సామాజిక న్యాయానికి వెన్నుపోటు పొడిచాడని పేర్కొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ అధికారంలోకి రాగానే మొదటి నెలలోనే రూ.4వేలు పెన్షన్ పెంచి మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చి మొదటి సంతకం మాట నిలబెట్టుకుందని తెలిపారు. అధికారంరాగానే రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమం చేశాం, ఇప్పటికి రూ.1200 కోట్లు ఖర్చు చేసి 20 వేల కిలోమీటర్ రోడ్లు బాగు చేశారని చెప్పారు. సమావేశంలో మాజీ జిపి గుర్రప్ప, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గొడుగునూర్ రాజశేఖర్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మసాపేట శివ, కడప ఎస్సీ సెల్ నగర ప్రధాన కార్యదర్శి రాయుడు, టిఎన్ఎస్ఎఫ్ కడప అధ్యక్షుడు అనిల్, ఎస్‌సి సెల్ నాయకుడు వీరయ్య పాల్గొన్నారు.

13 నుంచి ఉచిత యోగా శిక్షణ

ప్రజాశక్తి- కడప అర్బన్

ఈనెల 13 నుంచి కడప నగరం బాలాజీ నగర్‌లో ఉన్న ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ప్రెసిడెంట్ అనంతబొట్ల వెంకట సుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ప్రముఖ యోగా నిపుణులు డాక్టర్ ఆర్.రంగనాథ రెడ్డి శిక్షణ ఇస్తారని తెలిపారు. ఆసక్తి గల వారు క్యాంపు కో - ఆర్డినేటర్ కె.రాఘవేంద్ర వర్మ 98855 86825 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

సిఎం రమేష్, సురేష్ తీరు అభ్యంతరకరం

ప్రజాశక్తి - కడప అర్బన్

లోక్‌సభ సభ్యుడు సిఎం రమేష్, ఆయన సోదరుడు సిఎం సురేష్‌నాయుడు తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని పొట్లదుర్తి గ్రామస్తులు తెలిపారు. మంగళవారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్లదుర్తికి చెందిన వరప్రసాద్‌రెడ్డితో పాటు గ్రామస్తులు మాట్లాడారు. గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయానికి సంబంధించి భూమిని కబ్జా చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఈ ఆలయ ప్రహరీ నిర్మాణానికి అనకాపల్లి ఎంపీ సి.ఎం. రమేష్ గతంలో తన కోటా కింద నిధులు మంజూరు చేసి నేడు పనులు చేపట్టడంలో అంతర్యం అందరికీ తెలిసిందేనన్నారు. కబ్జా చేసిన విషయం వెలుగులోకి వస్తుందన్న కారణంతోనే కూటమి ప్రభుత్వంలో ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపట్టారన్నారు. ఆలయ స్థల విషయంగా అధికారులకు ఫిర్యాదు చేయడంతోపాటు కోర్టును ఆశ్రయించామన్నారు. ఆలయానికి సంబంధించిన మొత్తం స్థలంలో ఆక్రమణలను తొలగించిన తర్వాతే అభివృద్ధి పనులు ప్రారంభించాలని కోరుతున్నామన్నారు. దేశానికి స్వాతంత్ర్యం లభించినా పొట్లదుర్తికి స్వాతంత్ర్యం రాలేదన్నారు. దళిత, బడుగు, బలహీన వర్గాలకు ఇల్లు కట్టినప్పటికీ నేటికీ ఆ పట్టాలు ఇవ్వకపోవడం వెనుక సి.ఎం. రమేష్ నాయుడు హస్తం ఉందన్నారు. గత ఎన్నికల తర్వాత పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కోట్లాది రూపాయల అక్రమ ఇసుకకు తెర తీశారన్నారు. ఆయన వల్లనే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందన్నారు.సమావేశంలో లక్ష్మిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వీరారెడ్డి, రామానుజన్ రెడ్డి, సారెడ్డి, ఓబుల్ రెడ్డి, శివ, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వరప్రసాద్‌రెడ్డి

మాతృమరణాలను నివారించాలి : డిఎంహెచ్‌ఒ

మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ నాగరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.నాగరాజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సురభి, చింతకొమ్మదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన మాతృ మరణాలపై మంగళవారం డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మాతృ మరణాలకు గల కారణాలు సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఉన్నత ఆసుపత్రి స్పెషలిస్ట్ వైద్యులతో చర్చించారు. ప్రయివేట్ ఆస్పత్రులు, సర్వజన ఆసుపత్రికి సంబంధించిన వైద్యులతో వారు అందించిన సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సిబ్బందితో ప్రమాదకర గర్భిణులను గుర్తించి తరచుగా పరీక్షలు చేయాలని పేర్కొన్నారు. జనన ప్రణాళిక గురించి తెలియజేయాలని చెప్పారు. సకాలంలో వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించినట్లయితే మాతృ మరణాల శాతం తగ్గించ వచ్చునని పేర్కొన్నారు. డిఐఒ ఉమామహేశ్వర్ కుమార్, జిజిహెచ్ స్త్రీ వ్యాధి నిపుణులు డాక్టర్ నిలిమ స్త్రీ వ్యాధి నిపుణులు మాట్లాడుతూ గర్భిణికి ఐరన్ మాత్రలు, పండ్లు, ఆకుకూరలు, బెల్లంతో చేసిన చిక్కిలు తినాలని తెలిపారు. ఫ్యామిలీ ప్లానింగ్ పద్ధతులు పాటించాలని కోరారు. సమావేశంలో అనస్థీషియా డాక్టర్ ఫరూక్ బాషా, జిజిహెచ్ జనరల్ మెడిసిన్ డాక్టర్ వెంకట శ్రీనివాసులు, డిపిహెచ్ఎన్ఒ అరుణ కుమారి, ఆరోగ్య సిబ్బంది, ప్రయివేట్ ఆస్పత్రుల సిబ్బంది, ఆశాలు, మాతృ మరణానికి సంబంధించిన వారి బంధువులు హాజరయ్యారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

- వ్యవసాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి.సుమతి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఆధునిక సాంకేతిక పద్ధతులతో రైతులు అధిక దిగుబడులు సాధించ వచ్చునని తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి.సుమతి పేర్కొన్నారు. కడప ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని ఓబనపల్లె, విపిఆర్ కండ్రిక గ్రామాలలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ సుమతి మాట్లాడుతూ రైతులు విచక్షణా రహితంగా ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించాలని సూచించారు. శాస్త్రవేత్తల అధికారుల సలహా మేరకు ఎరువులు, మందులు వాడి పంట ఖర్చులు తగ్గించు కోవడమే కాకుండా నేల, వాము కాలుష్యంతో పాటు మన ఆరో గ్యాన్ని కూడా సంరక్షించుకో వచ్చునని తెలిపారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులు తామర పురుగుల సమస్య అధికంగా ఉందని తెలిపారని అందుకు తామర పురుగుల సమగ్ర యాజమాన్యం కోసం వేసవిలో లోతు దుక్కులు చేసుకోవాలని సూచించారు. పంట చుట్టూ నాలుగు వరుసలతో సజ్జ లేదా జొన్నను రక్షక పంటగా చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ టి.మహేష్ బాబు, డాక్టర్ ఎస్ మానస, ఆర్ గిరీష్‌కుమార్, మండల ఉద్యాన అధికారి భాస్కర్, బాలసుబ్రమణ్యం, బిటిఎం ఆత్మ పథకం గ్రామ ఉద్యాన సహాయకులు లక్ష్మీనారాయణ, రైతులు పాల్గొన్నారు. **కలికిరి :** కృషి విజ్ఞాన కేంద్రం కలికిరి సమన్వయకర్త డాక్టర్ కె.మంజుల పర్యవేక్షణలో మేడికుర్తి గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ అవగాహన కార్యక్రమం ఆరవ రోజు నిర్వహించారు. కెవికె సమన్వయకర్త డాక్టర్ కె. మంజుల మాట్లాడుతూ విత్తన శుద్ధి, జీవన ఎరువుల వాడకం, వేరుశనగ, వరి, కంది రకాల గురించి అంటు మొక్కల గురించి, భూసార పరీక్షల ప్రాముఖ్యత గురించి వివరించారు. వ్యవసాయ అధికారి మమత పచ్చిరొట్టె ఎరువుల వాడకం, ప్రభుత్వ పథకాల గురించి తెలియజేశారు. పశు వైద్యాధికారి డాక్టర్ గిరినాథ్ నట్టల నివారణ, టీకాల వేయించడం, పాడి రైతులకు ఉపయోగపడే పథకాల గురించి, దాణా ప్రాముఖ్యతను గురించి వివరించారు. ఆత్మ, బిటిఎం అమృత్ కుమార్ ఆత్మ ద్వారా అందించే సేవల గురించి తెలిపారు. ఉద్యాన విశ్వ విద్యాలయం నుంచి వచ్చిన డాక్టర్ రాజనాయక్ జామ తోటలు, అంజీర, అల్లనేరుడు లాంటి పంటలను ప్రోత్సహించాలని, బొప్పాయిలో తెగుళ్ళ యాజమాన్యం, టమోటలో ఎరువుల వాడకం మరియు గులాబి, కనకాంబరం, సంపంగిలో ఈ ప్రాంతానికి అనువైన రకాల గురించి వివరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సుమతి

మత విద్వేషాలకు పాల్పడవద్దు: డిఎస్‌పి

పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - కడప అర్బన్

బక్రీద్ పండుగ సందర్భంగా నగరంలో మత విద్వేషాలను రెచ్చగొట్టవద్దని డిఎస్‌పి వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం 2 టౌన్ పరిధిలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత ఘర్షణలకు విద్వేషాలకు పాల్పడకూడదని హెచ్చరించారు. ఎవరైనా ఆదేశాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. శాంతియుతంగా, సామరస్యంగా పండగ చేసుకోవాలని చెప్పారు. గోవధ నిషేధమని, ఎవరైనా గోవులను వధిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. కార్యక్రమంలో సిఐ నాగార్జున, ఎస్ఐలు, హుస్సేన్, సిద్దయ్య, పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **చాపాడు (మైదుకూరు) :** బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి ఘర్షణలకు పాల్పడవద్దని కులమతాలకతీతంగా సామరస్యంగా మెలగాలని అర్బన్ సిఐ రమణారెడ్డి కోరారు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ వారితో సమావేశం ఏర్పాటు చేశారు. బక్రీద్ సందర్భంగా అందరూ సామరస్యంగా మెలగాలని ,ఒకరినొకరు గౌరవించుకోవాలని సూచించారు. ఎలాంటి ఘర్షణలకు పాల్పడకూడదని, ఏమైనా సమస్యలు ఉంటే పోలీసులకు తెలపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చిరంజీవి, సుబ్బారావు, మత పెద్దలు పాల్గొన్నారు.

లైబ్రేరియన్‌లను సన్మానిస్తున్న గడియారం సాహితీ పీఠం సభ్యులు

జమ్మలమడుగు లైబ్రేరియన్‌గా బాబ్జీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు ప్రభుత్వ శాఖా గ్రంథాలయ అధికారిగా నాదేండ్ల బాబ్జీ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బండారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఇక్కడ పని చేస్తున్న అధికారికి వీడ్కోలు పలుకుతూ.. కడప నుంచి బదిలీపై వచ్చిన అధికారికి స్వాగతం పలికారు. ముఖ్యఅతిథిగా గడియారం సాహితీ పీఠం అధ్యక్షుడు డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి, బండారు శ్రీనివాసులు మాట్లాడుతూ జమ్మలమడుగు లైబ్రేరియన్‌గా గతంలో కూడా బాబ్జీ ఎంతో సమర్థవంతంగా పనిచేశారని గుర్తు చేశారు. బదిలీపై మళ్లీ ఇక్కడికి రావడం ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ పనిచేస్తున్న జింక చంద్రశేఖర్ కమలాపురానికి బదిలీ అయ్యారని తెలిపారు. చంద్రశేఖర్ జమ్మలమడుగు ప్రజలతో మంచి అనుబంధాన్ని ఏర్పరుచుకున్నారన్నారు. ఇందులో భాగంగా జింక చంద్రశేఖర్‌కు వీడ్కోలు పలుకుతూ బాబ్జీకి స్వాగతం పలికారు. అనంతరం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఇరువురిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శివ గణపతి, డాక్టర్ నరసింహులు, దాదా ఖలందర్, కృష్ణయ్య, అమీర్, కుండా భాస్కర్, లక్ష్మీనారాయణ, కవల రామయ్య, వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - చాపాడు

శాఖ గ్రంథాలయంలో మంగళవారం వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి జె శివ శంకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి రోజూ ఒక కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నా మన్నారు. విద్యార్థులకు పోటీలను నిర్వహించి శిక్షణా తరగతులలో చివరి రోజున బహుమతులు ప్రదానం చేస్తామ న్నారు. గ్రంథాలయ సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న గ్రంథాలయాధికారి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలోని కోతి సమాధి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున బుధవారం సాయంత్రం 3 గంటల నుండి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆశాఖ ఎఇఇ జగదీశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

లబ్ధిదారులతో మాట్లాడుతూ వరద కిషోర్‌రెడ్డి

నిర్దేశించిన గడువు వరకూ సరుకులు ఇవ్వాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వం నిర్దేశించిన గడువు వరకూ లబ్ధిదారులకు రేషన్ ఇవ్వాలని తహశీల్దార్ వరదకిషోర్‌రెడ్డి డీలర్లకు సూచించారు. మండల కేంద్రంలోని చౌక దుకాణాలను మంగళవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో విఆర్ఒ రాజశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు

సింహాద్రిపురం : రేషన్ డీలర్లు తూకాల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ సాయినాథ్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం సింహాద్రిపురం, గురజాల గ్రామాల్లో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వ ధరలకంటే అధికంగా వసూలు చేయరాదన్నారు. షాపులలో కేవలం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యం, చక్కెర, గోధుమ పిండి ఇవ్వాలన్నారు. అలా కాకుండా సబ్బులు, అగరబత్తీలు తదితర వస్తువులు విక్రయించరాదని సూచించారు.

వేంపల్లి : రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం శ్రీరాం నగర్‌లోని కాలేజీ రోడ్డులో ఉన్న 8వ డీలర్ షాపు ద్వారా నడవలేని వృద్ధులు, విభిన్నప్రతిభావంతులకు ఇంటి వద్దకే వెళ్లి డీలర్ ఏలిశమ్మ నుండి తహశీల్దార్ హరినాథ్ రెడ్డి అందజేశారు. ప్రతి నెల 15వ తేదీ వరకు రేషన్ బియ్యాన్ని డీలర్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ లోకేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయ భూములపై అర్థంలేని ఆరోపణలు

ప్రజాశక్తి - వేంపల్లె

దేవాలయ భూముల విషయంలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అర్థంపర్థం లేని ఆరోపణలు ప్రభుత్వంపై చేయడం శోచనీయమని బ్రాహ్మణ చైతన్య వేదిక నాయకులు సూగురు రఘునాథరావు, పివిఎస్‌వి ప్రసాదరావు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. దేవాలయం భూములు కౌలుకు ఇవ్వక దేవస్థానం అధికారులు సాగు చేస్తారా అని వారు మాజీ ఎమ్మెల్యేను ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వ పాలనలో కూడా ఇలాగే చేయలేదా అన్నారు. కౌలు లేదా లీజ్‌కు చేసుకొనే వ్యక్తులు సక్రమంగా దేవాదాయ శాఖకు డబ్బులు చెల్లించేటప్పుడు కొనసాగించడంలో తప్పు లేదన్నారు. గతంలో దేవాలయం భూములు కబ్జా చేస్తే మాట్లాడని వ్యక్తులు నేడు మాట్లాడం హాస్యాస్పదమన్నారు. దేవాలయం భూములు విషయంలో కూటమి ప్రభుత్వం ఏదో చేస్తున్నదని ప్రకటనలు చేయడం మంచిది బ్రాహ్మణ జాతికి, హిందూ సమాజానికి నష్టం జరగడం లేదని, ప్రస్తుత ప్రభుత్వంలో అభివృద్ధి జరుగుతోందని, అనవసర విమర్శలు చేయడం మానుకోవాలని కోరారు. గతంలో బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉండి అన్ని పథకాలు నిర్వీర్యం చేయలేదా అని ప్రశ్నించారు.

ఉత్తమ అధ్యాపకుడిగా ప్రభాకర్ ఎంపిక

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపుల పాయ క్యాంపస్‌లో ఉన్న ఒంగోలు ట్రిపుల్‌ఐటిలో పనిచేస్తున్న డాక్టర్ విరూపాక్షి ప్రభాకర్ ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికైనట్లు డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు. ఎనిమిదేళ్ల నుంచి కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయనకు ఈనెల 25న హైదరాబాదులోని వరల్డ్ చారిటీ వెల్ఫేర్ ఫౌండేషన్ వారు బెస్ట్ టీచర్‌గా అవార్డు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పరిపాలన అధికారి రవికుమార్, కెమిస్ట్రీ విభాగ అధ్యాపక బృందం, అధ్యాపకులు, విద్యార్థులు, హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

అడిగేదెవరు.. ఆపేదెవరు..?

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పథకం అక్రమార్కులకు వరంలా మారింది. ఉచితం పేరిట ఇసుక అక్రమ రవాణా చేస్తూ తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా మార్చుకొని అక్రమ సంపాదనను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రాంతం నుంచి కాకుండా ఎక్కడపడితే అక్కడ తవ్వకాలు జరుపుతూ తమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. మండలంలోని త్రిపురవరం, కొమ్మలూరు గ్రామాల్లోని నదీ పరివాహ ప్రాంతాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక తవ్వకాల వల్ల పంపు స్కీం మోటర్లకు ప్రమాదం వాటిల్లుతుందని, తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా ఇసుక అక్రమ రవాణా మాత్రం తగ్గడం లేదు. ఇటీవలే గ్రామాల్లోని కొందరు ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లను అడ్డుకోవడంతో కొన్ని రోజులపాటు ఇసుక తవ్వకాలు నిలిపేశారు. ఇటీవల కాలంగా మళ్లీ ఇసుక తవ్వకాలు ప్రారంభం చేపట్టారు. ప్రభుత్వ అధికారులు, అధికార పార్టీ నాయకులు ఒక్కటై ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారని ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు తమకు సంబంధం లేదని దాటవేస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రభుత్వ అధికారులు, పార్టీ నేతలు అవినీతికి పాల్పడితే సహించేది లేదన్న ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేకపోతోందని నదీ పరివాహక ప్రాంత ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

ఆస్తిపన్ను పెంపు ఉపసంహరించుకోవాలి

ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆస్తి పన్నును ప్రతి సంవత్సరం 15శాతం పెంచడం ప్రజలకు భారం అవుతుందని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆస్తి పన్నును ప్రతి సంవత్సరం 15శాతం పెంచడం మంచి పద్ధతి కాదన్నారు. ఇది ప్రజలు కట్టలేని పరిస్థితి అన్నారు. ఆస్తి విలువను బట్టి దాన్ని పరిగణలోకి తీసుకొని ఆస్తి పన్ను పెంచుతూ రావడం అన్యాయమన్నారు. ఈ రకంగా 20ఏళ్లు గడిస్తే సొంత ఆస్తులకు పన్నులు కట్టలేక ప్రభుత్వానికి వదిలేయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఇలాంటి భారాలను వెంటనే ఉపసం హరించుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలు అధికారం కట్ట బెడితే ఇలా ప్రజలపై భారాలు వేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఇదే పరి స్థితి కొనసాగితే గత ప్రభుత్వానికి పట్టిన పరిస్థితి కూటమి ప్రభుత్వానికి కూడా పడుతుందని ఆయన హెచ్చరించారు. బిజెపి ప్రభుత్వం అప్పు ఇచ్చే దానికోసం ఆస్తి పన్నులను విలువను బట్టి పెంచమని జిఒ ఇస్తే దాన్ని మీరు రాష్ట్రంలో అప్పుల కోసం అమలు చేస్తున్నారన్నారు. ధర్నాలో సిపిఎం నాయకులు రాములమ్మ, డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అంజుమన్ కమిటీ ఎన్నికలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రెండు రోజుల క్రితం ప్రొద్దుటూరులో జరిగిన అంజుమన్ కమిటీ ఎన్నికలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని ఆయిల్ మిల్ ఖాజా తీవ్రంగా ఖండించారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంజుమన్‌కు అనుసంధానమైన మసీదుల నుండి సభ్యులను సమావేశపరిచి, చర్చించి, ప్రకటించాల్సి ఉందన్నారు. ఇందుకు విరుద్ధంగా ఒకరి ఇంట్లో కూర్చుని ప్రయివేట్ వ్యవహారం మాదిరి జరపడం తగదని ఖాజా తీవ్రంగా ఆక్షేపించారు. ఈ విధానం అంజుమన్ బైలాకు పూర్తిగా విరుద్ధమన్నారు. అంజుమన్ కమిటీకి జరిగిన ఏకగ్రీవ ఎన్నిక పూర్తిగా దొడ్డిదారిన జరిగిందని విమర్శించారు. సర్ఫరస్‌గా ఉండి రాజీనామా చేస్తే తదుపరి ఎన్నికల్లో పాల్గొనకూడదనేది నిబంధన అని, దాన్ని కూడా కాలరాశారన్నారు. ఇప్పుడు ఏకగ్రీవ అధ్యక్షుడిగా ప్రకటించుకున్న ముక్తియార్ గతంలో సరఫరాస్‌గా ఉండి రాజీనామా చేశాడని ఖాజా తెలిపారు. అంజుమన్ కమిటీ బైలాను ముక్తియార్ ఇష్టారీతిన వినియోగించుకుంటూ దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. పెద్ద మనుషులుగా చలామణి అయ్యేవారు తమకు ఇష్టం వచ్చినట్లు వక్ఫ్ భూములను కాజేశారని ఆరోపించారు. దాదాపీర్ అనే పెద్దమనిషి 73 సెంట్లు అమ్ముకున్నారని, దీనిపై ఆయనపై రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు కూడా ఉందన్నారు. ఈ కేసులో దాదాపీర్ రెండవ ముద్దాయి అన్నారు. ఈ కేసును తాను తిరిగి తెరిపించి వక్ఫ్ భూములకు న్యాయం చేస్తానన్నారు. ఇనాయతుల్లా పలు అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో తొమ్మిది మంది ముస్లిం వర్గానికి చెందిన కౌన్సిలర్లు ఉన్నారని వీరిని ఎప్పుడైనా ముక్తియార్ పిలిచి మాట్లాడారా అని ఆయన ప్రశ్నించారు. ముక్తియార్ ఎప్పుడు కూడా తన అనుచరులను రాజకీ యంగా ఎదగనివ్వరన్నారు. తెలుగుదేశం పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఖాజామోదీన్ ప్రతీ నెలా నాలుగు లక్షల రూపాయలు ఆస్తులు దుర్వి నియోగం అవుతున్నాయని వక్ఫ్ సీఈఓకు ఫిర్యాదు చేయగా ఆయన ముక్తి యార్‌కు షోకాస్ నోటీసు జారీ చేయగా, దీన్ని కోర్టు ద్వారా స్టే తెచ్చు కున్నార న్నారు. దర్గా ఆస్తి రూ.11 లక్షలు దుర్వినియోగం చేశారని ఆయన ఆరో పించారు. దీనిపై న్యాయపోరాటం చేస్తానన్నారు. పెద్ద మను షులుగా చలా మణి అయ్యే వీరి ద్వారానే వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం అయ్యా యని న్యాయ పోరాటం ద్వారా వీటిని పేద ముస్లిం సమాజానికి ఉప యోగపడేలా చేస్తా మని ఖాజా అన్నారు. సమావేశంలో గైబూసా, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన ఆస్తుల వివరాలు తెలుపుతున్న ఆయిల్ మిల్ ఖాజా

పుష్పగిరిలో పురాతన మృత్యుంజయ స్వామి విగ్రహం గుర్తింపు

ప్రజాశక్తి - వల్లూరు

మండలంలోని అత్యంత ప్రసిద్ధి చెందిన దక్షిణ కాశీ అయిన పంచమ నది పుణ్యక్షేత్రం పుష్పగిరి శ్రీవైద్య నాథస్వామి దేవాల యానికి అతి సమీపంలోని పురాతనమైన శ్రీమృత్యుంజయ స్వామి విగ్రహం ఉండడాన్ని గుర్తించినట్లు రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ మంగళవారం మీడియాకు తెలిపారు. శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయం కొండ నుంచి ఖాజీపేటకు వెళ్లే రహదారిలో చింతలపత్తూరుకు అతి సమీపంలో ఓ దుర్గ గుడి ఉండేదన్నారు. ఆ గుడి ప్రాంగణంలో బహిర్గతంగా సుమారు 15 సంవత్సరాల క్రితం ఒక శివుని విగ్రహం, పానమట్టం ఉండేవని తెలిపారు. వాటిని పుష్పగిరి ప్రాంతానికి చెందిన కురుమద్ది రమణమూర్తి, గ్రామస్తులు కట్టెపుల్లలు తెచ్చుకోవడానికి వెళ్లిన సమయంలో రమణమూర్తి ఆ విగ్రహాన్ని, పానమట్టం కనుగొని అక్కడి నుంచి శ్రీ వైద్య నాదస్వామీ ఆలయ సమీపంలో ఉండే పాతాళ గణపతి ఆలయ ప్రాంగణంలోకి చేర్చారు. ఆ విగ్రహానికి రమణమూర్తి మృత్యుంజయ స్వామి అని పేరు పెట్టినట్లు రచయిత వివరించారు. విగ్రహం విషయాల గురించి రమణమూర్తి బంధువు రాజేష్ తనకు చెప్పారని రచయిత వెల్లడించారు. దీనిపై మరింత పరిశోధన చేయనున్నట్లు రచయిత తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మండల కూటమి అధ్యక్షులు తప్పెట్ల మధుసూదన్ రెడ్డి బాధిత కుటుంబాలకు మంగళవారం పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆదేశాల మేరకు చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి లేఖ ద్వారా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇద్దరు బాధిత కుటుంబాలకు ఆసరాగా చెక్కులు పంపించారన్నారు. మృతి చెందిన చంగంరెడ్డి నిఖిలేశ్వర్‌రెడ్డి కుటుంబానికి రూ.3,55,088, బాలుడు అభిరామిరెడ్డి చికిత్స నిమిత్తం ఆ కుటుంబానికి రూ.78,071 చెక్కు అందించామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు సంజీవరెడ్డి, కూటమి నాయకులు కత్తి ప్రతాపరెడ్డి, కోడూరు మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

చెక్కులను బాధితులకు అందిస్తున్న కూటమి నాయకులు

అభివృద్ధికి నోచని గడ్డమాలవాడ

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని కడప రోడ్డులో ఉన్న గడ్డమాలవాడ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ చాలా అధ్వానం. డ్రయినేజీ కాలువలు అందుబాటులో లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై పారుతోంది. గ్రామానికి చుట్టువైపులా మురుగునీరు నిలువ ఉంటూ దోమలు వృద్ధి చెందుతున్నాయి. మైదు కూరుకు కూతవేటు దూరంలో ఉన్న గడ్డమాలవాడలో ఎస్‌సికి చెందిన పేదలే. నిత్యం వివిధ రకాల కూలి పనులు, పశుపోషణ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో ప్రజలు రోగాల బారిన పడుతూ ఆర్థికంగా దెబ్బతింటున్నారు. మంచినీటి పథకం వద్ద నిత్యం మురుగునీరు నిలువ ఉంటోంది. అభివృద్ధిని కొన్నేళ్లుగా అధికారులు పట్టిం చుకోవడం లేదు. అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ లేకపోవడంతో ఇనుప తంతేను ఏర్పాటు చేసి సంరక్షణ చేపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలకు మాత్రం నాడు-నేడు కింద ప్రహరీ నిర్మించారు. గ్రామంలోకి వెళ్లే సిమెంటు రోడ్డు కూడా దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో ముఖ్యంగా ముగురునీరు పోయే ఏర్పాటుతోపాటు ఇతర సమస్యలు పరిష్కరిస్తే పేద ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

మంచినీటి పథకం వద్ద అధ్వానంగా ఉన్న పారిశుధ్యం

మొక్కజొన్న సాగు.. ఆదాయం బాగు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల వ్యాప్తంగా రైతులు మొక్కజొన్న పంట సాగు వైపు దృష్టి సారించారు. వరితోపాటు ఇతర పంటలకు పెట్టుబడి ఖర్చులు పెరి గాయి. గిట్టుబాటు ధరలు లేకపోవడంతో మొక్కజొన్నను విస్తారంగా సాగు చేశారు. మండల పరిధిలోని కొత్తపేట, కొత్త నెల్లూరు, చెన్నముక్కపల్లె, నాగసానిపల్లి తదితర గ్రామాల్లో మొక్కజొన్న రైతులు విస్తారంగా సాగు చేశారు. ఎకరాకు 40 క్వింటళ్ల దిగుబడి వస్తుందని, రూ.80 వేల వరకు వస్తుండగా పెట్టుబడి ఖర్చు పోనూ ఎకరాకు రూ.45 వేల వరకు ఆదాయం సమకూరుతుందని రైతులు పేర్కొంటున్నారు. పంట కాలం కూడా మూడున్నర నెలలు మాత్రమే. ఈ కారణంగా మొక్కజొన్నను అధికంగా సాగు చేస్తున్నామని ఆంజనేయపురం రైతులు పేర్కొంటున్నారు.

ఆంజనేయపురం వద్ద సాగులో ఉన్న మొక్కజొన్న

ఫోన్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

ప్రజా సమస్యలపై పోరాటం

- ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటా : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని, ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఇందుకు ఎంపీ స్పందిస్తూ ఎవరు అధైర్యపడద్దని, మీ వెంట నేనుంటానని భరోసా ఇచ్చారు. సమస్యలను సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తెలిపి వెంటనే పరిష్కరించాలన్నారు.

సమావేశంలో వైద్య సిబ్బంది

మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి ఒక్కరూ పరిసరాలుశుభ్రంగా ఉంచుకోవాలని, మలేరియా జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి అయేషా సూచించారు. అపరిశుభ్రత కారణంగా వ్యాధులు సోకుతాయని అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. మలేరియా మాసోత్సవాల సందర్భంగా జ్వరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతపై దృష్టి పెట్టేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

వేంపల్లి : తాళ్లపల్లెలో ర్యాలీ చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

వేంపల్లి : దోమ కాటు వల్ల మలేరియా వ్యాధి వస్తుందని, దాని నివారణకు దోమతెరలు వాడాలని ప్రభుత్వ వైద్యులు పృథ్వీకుమార్‌రెడ్డి సూచించారు. మలేరియా వారోత్సవాల సందర్భంగా మంగళవారం మండలంలోని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా నివారణకు తొట్లు, కుళాయిల వద్ద నీరు నిలువ ఉండరాదన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటిలో పనికిరాని చెత్తను ఉంచరాదన్నారు. కార్యక్రమంలో వైద్యులు నిహారిక, శాంతి, సిహెచ్ఒ వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నీస, ఎంపిహెచ్ఈఓ ఫకృద్దీన్, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మీ, అరుణదేవి, అంకయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

డీలర్లకు మిషన్లు అందజేస్తున్న ఎఒ వెంకట కృష్ణారెడ్డి

ఎరువుల డీలర్లకు డిబిటి మిషన్లు అందజేత

ప్రజాశక్తి - ముద్దనూరు

ఎరువుల మందుల డీలర్లు డిబిటి మిషన్ల ద్వారా క్రయవిక్రయాలు చేసి వివరాలు ఈ పాస్ మిషన్‌లో నమోదు చేయాలని మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం ఎఒ ఆధ్వర్యంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ వారి సౌజన్యంతో స్మార్ట్ పిఒయస్ డిబిటి మిషన్లను ఎరువుల డీలర్లకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు డిబిటి మిషన్ ద్వారానే ఎరువులు క్రయవిక్రయాలు చేయాలన్నారు. రైతులకు అమ్మిన ఎరువులను ఈ పాస్ మిషన్‌లో నమోదు చేయాలన్నారు. ఎరువులకు సంబంధించిన వివరాలు స్టాక్, గోడౌన్‌లో నిల్వ ఉన్న వివరాలకు డిబిటి మిషన్‌లో వ్యత్యాసం ఉండకూడదన్నారు. ఈ పాస్ మిషన్ వినియోగించే, పని చేసే విధానం గురించి డీలర్లకు వివరించారు. కంపెనీ ఉద్యోగులు గోవర్ధన్‌రెడ్డి, రామేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఖనిజ నిక్షేపాల కోసం శోధన

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని సీతారామాపురం, కుచ్చుపాప, నరహరిపురం, అనంతపురం గ్రామాల పరిధిలో పంట పొలాల్లో ఖనిజ నిక్షేపాల కోసం శోధన చేపడుతున్నారు. భూమిలో బోర్లు, ఫిల్టర్ల ద్వారా రిగ్గు వేసి ఖనిజాలను అన్వేషిస్తున్నారు. పది రోజులుగా వందల సంఖ్యలో బోర్లు వేసే వాహనాలతో పరిశోధన చేస్తున్నారు. ఆయిల్ ఖనిజాలు, ఇతర ముడి ఖనిజాలు అందుబాటులో ఉంటాయన్న అంచనాతో పరిశీలన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎకరాలో 20 నుంచి 30 వరకు బోర్లు వేస్తూ వెంటనే వాటిని పూడ్చి వేస్తున్నారు. కొన్ని ప్రత్యేకమైన యంత్రాలతో బోర్లు వేసిన అనంతరం తరంగాలను రికార్డు చేసుకుంటూ బోరు గుంతలను పూడ్చివేస్తున్నారు.

సీతారామాపురం పొలాల్లో బోర్లు వేస్తున్న వాహనాలు